క్లుప్తంగా

మొక్కలు సంరక్షించండి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి

కొల్చారం(నర్సాపూర్): రహదారి వెంట నాటిన మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి సంబంధిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మెదక్ – నర్సాపూర్ జాతీయ రహదారి వెంట ఉన్న కొల్చారం, పోతంశెట్టి పల్లి, అప్పాజీపల్లి, రాంపూర్, కిష్టాపూర్ గ్రామాలను సందర్శించి రహదారి వెంకన్న నాటిన మొక్కల సంరక్షణను పర్యవేక్షించారు. నాటిన మొక్కను బతికించేందుకు అవసరమైన నీటిని అందించడం, ట్రీ గార్డుల ఏర్పాటు పనులను పరిశీలించారు. ఆయన వేట ఏపీఓ మహిపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అభినందనలు



ఎంబీబీఎస్ పట్టా అందుకుంటున్న ప్రవళిక

హవేళీఘనపూర్: మండల పరిధిలోని గ్రామం జక్కన్నపేట గ్రామానికి చెందిన చామంతుల ప్రవళిక ఆదివారం రాత్రి ఆదిలాబాద్ రిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తిచేసి, పట్టా అందుకుంది. మారుముల ప్రాంతం జక్కన్నపేట గ్రామంలో జన్మించిన ప్రవళిక మంచి స్థాయికి ఎదిగి పుట్టిన గడ్డకు మంచి పేరు తీసుకురావడంపై పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఆమెనును అభినందించారు.

గుంతను పూడ్చాలి



చిప్పల్‌తుర్తి సమీపంలో
రోడ్డుపై ఏర్పడిన గుంత

నర్సాపూర్ రూరల్: మండలంలోని రెడ్డిపల్లి – ఇబ్రహీంబాద్ ఆర్అండ్‌బీ రహదారిలోని చిప్పల్‌తుర్తిలో సమీపంలో రోడ్డుపై గుంత ఏర్పడి ప్రమాదంగా మారింది. నిత్యం రాత్రి పగలు తేడా లేకుండా ఈ దారి వెంట చిప్పల్ తుర్తి, జక్కపల్లి, ఆద్మాపూర్, ఇబ్రహీంబాద్‌తో పాటు సంగారెడ్డి జిల్లాలోని సిరిపురం, జోగిపేట, తదితర గ్రామాలకు వేల మంది ద్విచక్ర వాహనాలు తిరుగుతుంటాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

దేశంలో మహిళలకు రక్షణ కరువు

తూప్రాన్: దేశంలో మహిళలకు రక్షణ కరువైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, సంతోష్ అన్నారు. సోమవారం పట్టణంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఆల్ ఇండియా కమిటీ పిలుపుమేరకు మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కార్తీక్, డివిజన్ నాయకులు రమేశ్, చరణ్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు భేష్: మున్సిపల్ చైర్మన్

నర్సాపూర్: పాఠశాలల్లో విద్యతో పాటు ఇతర కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని గిరిదీపం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఇన్వెస్టిచర్ సెర్మనీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయా సందర్భాలను గుణంగా పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల పోటీలు నిర్వహించడంతో విద్యార్థులు చురుకుగా తయారవుతారని, ఆయా అంశాలపై అవగాహన పెంచుకుంటారన్నారు. కార్యక్రమంలో సాధన గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఎండీ ప్రవీణ్‌రెడ్డి, డైరెక్టర్ కవితరెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, పలు పాఠశాలల చైర్మన్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని నర్సంపల్లి తండా, జెమ్లా తండా, చిన్నతండాలకు తారురోడ్డు మంజూరు చేసినందుకు సోమవారం పెద్దతండాలో గిరిజనులు, బీఆర్ఎస్ కార్యకర్తలు సీఎం కేసీఆర్, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బాబు, పెద్ద తండా బీఆర్ఎస్ అధ్యక్షుడు బాషానాయక్, తండా సర్పంచ్ చత్రియా నాయక్, సహకార సంఘం డైరెక్టర్ బిక్యానాయక్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన విద్యార్థులు

- మినీ బస్సుల్లో స్టూడెంట్ పాస్‌లు తీసుకోవాలని డిమాండ్
- టేక్మాల్ చౌరస్తాలో బైఠాయింపు



టేక్మాల్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

టేక్మాల్(మెదక్): బస్సులు సమయానికి రాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని విద్యార్థులు ఆందోళన చేపట్టారు. మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు సమయపాలన పాటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మెదక్ – బొడ్మట్‌పల్లి ప్రధాన రహదారి అయిన టేక్మాల్ చౌరస్తాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... టేక్మాల్ పాఠశాలకు, కళాశాలకు పాపన్నపేట మండలంలోని అర్కెల, మిన్‌పూర్, నార్సింగ్ తదితర గ్రామాలతో పాటూ టేక్మాల్ మండలంలోని వెంకటాపూర్, సంగ్యాతాండా, కబడిలాబాయి తండా విద్యార్థులకు ఉదయం 10 దాటినా.. బస్సులు రావడం లేదన్నారు. దీంతో పాఠశాలలకు చాలా ఆలస్యంగా చేరుకోవడంతో క్లాసులు మిస్ అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం సైతం బస్సులు రాకపోవడంతో ఇంటికి తిరిగి వెళ్లేసరికి చీకటి అవుతుందని వివరించారు. బస్సుల కోసం ఎదురు చూస్తూ సమయం అంతా వృథా అవుతుందని వాపోయారు. మినీ బస్సులు అధికంగా వేశారని, మినీ బస్సుల్లో బస్‌పాస్‌లు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని బస్సుల్లో స్టూడెంట్ బస్‌పాస్‌లతో ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ధర్నా చేస్తున్న ప్రాంతానికి చేరుకొని డిపో మేనేజర్‌తో మాట్లాడారు. తమ సమస్య తీరుతుందని విద్యార్థులకు హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బస్తీబాట

- 11 వార్డులో పర్యటించిన మున్సిపల్ పాలకవర్గం



మురుగు కాల్వను పరిశీలిస్తున్న చైర్మన్

రామాయంపేట(మెదక్): సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బస్తీబాట నిర్వహిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో సోమవారం బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, కౌన్సిలర్లు, కమిషనర్, అధికారులు వార్డులో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వార్డు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మురుగుకాల్వలతో పాటు శిథిలమైన రహదారులను పరిశీలించారు. వార్డులో నెల కొన్న సమస్యలను పరిష్కరిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరయ్యాయని, ఈ మేరకు పనులు కొనసాగుతున్నాయన్నారు. వార్డులో పాక్షికంగా శిథిలమైన రహదారులు, మురుగు కాల్వలు మరమ్మతు చేయించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.

బడుగులకు అందని సంక్షేమ పథకాలు

- నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్

నర్సాపూర్: బడుగు బలహీన వర్గాలను బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు అందలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్ ఆరోపించారు. ఆయన ఆధ్వర్యంలో హత్నూర మండలలోని మధుర గ్రామానికి పలువురు మహిళలు బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. అనంతరం ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ వస్తే తమ బతుకులు మారుతాయని బడుగు బలహీన వర్గాల ప్రజలు ఆశించారని, వారి ఆశలు అడియాసలైనాయన్నారు. దళితులకు దళితబంధు అందరికి ఇవ్వడం లేదని, ఇతర పథకాలు సైతం బడుగులకు అందడం లేదని వాపోయారు. కాగా హత్నూర మండలంలోని మధుర గ్రామానికి చెందిన దళితులను బీఆర్ఎస్ ప్రభుత్వం, స్థానిక బీఆర్ఎస్ నాయకులు మోసం చేశారన్నారు. మధుర గ్రామానికి చెందిన నీలమ, కమల, లక్ష్మి, నర్సమ్మ తదితరులు మాట్లాడుతూ.. తమకు ప్రభుత్వం నుంచి ఆర్థిక పరంగా ఎలాంటి సహకారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ తాము బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరుతున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, నాగప్రభుగౌడ్, రవి పాల్గొన్నారు.



మహిళలకు కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న మున్సిపల్ చైర్మన్

అందరికీ దళితబంధు ఇవ్వండి



మాట్లాడుతున్న అచ్చన్నపల్లి దళితులు

టేక్మాల్(మెదక్): మండలంలోని అచ్చన్నపల్లి గ్రామంలో ఉన్న దళితులందరికీ దళితబంధు ఇవ్వాలని కోరుతూ సోమవారం టేక్మాల్ మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీడీఓ భారతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామంలో ఎంతో మంది దళిత కుటుంబాలు ఉన్నాయని, అందరు నిరుపేద కుటుంబ సభ్యులమేనన్నారు. అందరికీ దళితబంధు ఇప్పించి న్యాయం చేయాలని, లేకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

మంత్రులను కలిసిన మున్సిపల్ చైర్మన్



మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుతో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ సోమవారం మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ విషయం రామాయంపేట వాసుల చిరకాల కోరికగా మిగిలిపోయిందని, ఈ విషయమై చొరవ తీసుకోవాలని కోరానని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు గాను రు. 25 కోట్లు మంజూరు చేయాలని, రామాయంపేటకు డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని వివరించానని తెలిపారు. తమ వినతులకు మంత్రులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

పోరాటయోధులకు గౌరవం ఇదేనా..?



మంభోజిపల్లి పాఠశాల ఎదుట ఉన్న సుభాశ్‌చంద్రబోస్ విగ్రహం

హవేళీఘనపూర్: మహనీయుల విగ్రహాలకు ఆదరణ కరువైంది. మండలంలోని మంభోజిపల్లి గ్రామంలో హైవే రోడ్డు నిర్మాణంలో చౌరస్తాలో సుభాశ్‌చంద్రబోస్ విగ్రహం గతంలో ఏర్పాటు చేశారు. ఈ విగ్రహం నేడు ఆదరణకు నోచుకోక మెదక్ – బొడ్మట్‌పల్లి రహదారికి పక్కన పెట్టారు. దీంతో పలువురు మేధావులు మాట్లాడుతూ.. కనీసం పాఠశాలలో అయిన ప్రతిష్ఠిస్తే రాబోయే తరాలకు వారు చేసిన త్యాగాలను గుర్తుకు ఉండేలా చూడాలని పేర్కొంటున్నారు. చిన్న చిన్న పథకాలు ప్రవేశపెడితే చిత్రపటాలకు పూలమాలలు వేసి, హంగామా చేసే రాజకీయ నాయకులకు ఇది కనిపించడకపోవడం శోచనీయం.

దుకాణ సముదాయం పనుల పరిశీలన



ఇరువర్గాల వాదనలు వింటున్న తహసీల్దార్ నాగవర్ధన్

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి గ్రామ శివారులో వెల్దుర్తి – మెదక్ ప్రధాన రహదారి పక్కన సర్వే నంబర్ 2,332లో నిర్మిస్తున్న దుకాణ సముదాయాలను సోమవారం తహసీల్దార్ నాగవర్ధన్ తన సిబ్బంది, ఈఓతో కలిసి పరిశీలించారు. ఈ క్రమంలో నిర్మాణం చేపడుతున్న భూ యజమాని, వెల్దుర్తి ఎంపీటీసీ– 2 మోహన్‌రెడ్డి, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్‌ల వర్గీయుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. పాత పానాదిని ఆక్రమించి దుకాణాలను నిర్మిస్తున్నారని వైస్ ఎంపీపీ ఆరోపించగా ఇతరుల నుంచి కొనుగోలు చేసిన తన పట్టాభూమిలోనే నిర్మాణాలు చేపడుతున్నానని మోహన్‌రెడ్డి అన్నారు. రెవెన్యూ నక్ష, రికార్డుల్లో ఎక్కడైనా ప్రభుత్వ పానాదిగా ఉన్నట్లు నిరూపిస్తే నిర్మాణాలు చేపడుతున్న స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. నిర్మాణాలు చేపడుతున్న మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్ వర్గీయుల మధ్య మాటలయుద్ధం జరిగింది. తహసీల్దార్ వెంట గిర్దావర్ జయభరత్‌రెడ్డి, ఈఓ బలరాం రెడ్డి, సర్వేయర్ యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

లాభాల బాటలో చిన్నగొట్టిముక్కుల సంఘం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చిన్నగొట్టిముక్కుల గ్రామ సంఘం రూ. 4.85లక్షలతో లాభాల బాటలో నడుస్తుందని ఏపీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం చిప్పగొట్టిముక్కుల గ్రామసంఘం వార్షిక మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. గ్రామంలో 33 సంఘాలు ఉండగా బ్యాంక్ ద్వారా రూ. 2.79కోట్లు రుణాలు ఇచ్చిందన్నారు. దీంతో పాటు స్త్రీనిధి ద్వారా రూ. 45.55లక్షలు, సీఐఎఫ్ ద్వారా రూ. 14లక్షలు రుణం ఇచ్చిందన్నారు. న్యూ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా 8 మందికి కొత్త వ్యాపారాలకు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. వరిధాన్యం కొనుగోలు ద్వారా రూ 6.9లక్షల కమీషన్ వచ్చిందన్నారు. గ్రామసంఘం లావాదేవిలతో రూ 4.85లక్ష లభాల్లో కొనసాగుతుందన్నారు. సర్పంచ్ బాలమణి మాట్లాడుతూ గ్రామ సంఘం భవనం నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు షాహీన్, ఉపాధ్యక్షురాలు సుమలత, సీసీ సరిత, తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలోని కేజీబీవీలో కళ్లకలక

- 15 మంది విద్యార్థులకు అస్వస్థత

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని కేజీబీవీ స్కూల్‌లో కళ్లకలకతో ఏకంగా 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు నాలుగైదు రోజులుగా ఇబ్బందులు పడుతూ ప్రత్యేక గదిలో ఉంటున్నారు. వైరల్ ఇన్‌ఫెక్షన్‌తో కళ్లకలక సోకినట్లు తెలిసింది. వీరిని వాహనంలో మండలంలోని ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ.. కళ్లకలక సోకిన విద్యార్థినులను ఇతర విద్యార్థులకు దూరంగా ఉంచామని, వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పిల్లల తల్లిదండ్రులు ఎవరూ ఆందోళన చెందొద్దని ప్రిన్సిపాల్ సూచించారు.



కళ్లకలకతో బాధపడుతున్న కేజీబీవీ విద్యార్థినులు

కాలనీ ప్రజలకు అండగా త్రిష

రేగోడ్(మెదక్): మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని ఓ కాలనీ ప్రజలకు కాంగ్రెస్ నాయకురాలు త్రిష అండగా నిలిచారని కాంగ్రెస్ నాయకుడు శంకరప్ప సోమవారం తెలిపారు. ఇటీవల గ్రామానికి వచ్చిన త్రిషకు కాలనీ ప్రజలు రోడ్డు బాగాలేదని, గుంతలతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వారి సమస్యలను వివరించారు. వెంటనే స్పందించిన ఆమె రూ.50వేలతో రోడ్డుపై మొరం వేయించారు. దీంతో వారు ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు.

చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

శివ్వంపేట(నర్సాపూర్): అనుమతులు లేకుండా వెంచర్లు చేస్తు భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం బీజేపీ మండలాధ్యక్షుడు రవిగౌడ్ మాట్లాడుతూ... మండలంలోని చిన్నగొట్టిముక్కుల, సికింద్లాపూర్, నవాపేట్, చెండి, దొంతి, కొంతాన్‌పల్లి గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు నాయకులు వెంచర్లు చేస్తూ అక్రమంగా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అక్రమ భూదందాకు అడవిలో నుంచి రోడ్డును వేస్తున్నారని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు అశోక్, మనిగౌడ్ పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్: రక్తదాన, వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. ఆమె సోమవారం మాట్లాడుతూ.. ఈనెల 15న తన భర్త శివ్వంపేట జెడ్పీటీసీ దివంగత వాకిటి లక్ష్మారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని కంజర్ల శంకర్‌యాదవ్ ఫంక్షన్ హాల్‌లో రక్తదాన, ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. లక్ష్మారెడ్డి అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. ఉచిత వైద్య శిబిరంలో వైద్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. కాగా గత విద్యా సంవత్సరం పదో తరగతిలో మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన 8 మంది విద్యార్థులకు విద్యా వికాస్ అవార్డులు అందజేస్తామన్నారు.

జాతీయ జెండాల పంపిణీ

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామ సర్పంచ్ చప్పెట నర్సింహరెడ్డి ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు వారి ఇంటిపై జాతీయ తివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని తెలిపారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యదర్శి నర్సింహరెడ్డి, ఉపసర్పంచ్ రమేశ్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌పై అవగాహన

కౌడిపల్లి(నర్సాపూర్): ఆయిల్‌పామ్ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని కౌడిపల్లి వ్యవసాయ డివిజన్ ఏడీఏ పుణ్యవతి తెలిపారు. సోమవారం కౌడిపల్లిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ పంట సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. హార్టికల్చర్ ఆధ్వర్యంలో రైతులకు ఎకరాకు 57 ఆయిల్‌పామ్ మొక్కలను పంపిణీ చేస్తుందన్నారు. దీంతో పాటు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీపై డ్రిప్ అందిస్తుందన్నారు. నాలుగేళ్ల పాటు ఏడాదికి అంతర పంట, నిర్వహణ ఖర్చు రూ. 4,200 అందజేస్తారన్నారు. రైతులకు భూమితో పాటు బోరు, కరెంట్ సౌకర్యం ఉండాలన్నారు.

వల్లూరు కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని వల్లూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చాకలి స్వామి, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా భూమయ్య, ఫిషర్‌మెన్ అధ్యక్షుడిగా స్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మహేశ్, వోబీసీ సెల్ అధ్యక్షుడిగా వినోద్, కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా నరేశ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నర్సమ్మ, మైనారిటీ అధ్యక్షుడిగా అప్సర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసగౌడ్, డీసీసీ నాయకుడు యాదగిరి యాదవ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి, మండల ఫిషర్‌మెన్ విభాగం అధ్యక్షుడు సుధాకర్, శంకర్‌నాయక్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి



కౌడిపల్లి(నర్సాపూర్): చేతులు శుభ్రంగా కడుకోవాలని సలాబత్‌పూర్ ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లేవల్ హెల్త్ ప్రొవైడర్)స్రవంతి తెలిపారు. సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భోజనానికి ముందు, బహిర్భూమికి తర్వాత చేతులకు సబ్బుతో శుభ్రంగా కడుకోవాలని తెలిపారు. చేతులు కడుకోవడంపై ఐదు రకాల పద్ధతులను చూపించారు. పాలు, కోడిగుడ్డు, ఆకుకూరలు తినాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వినోధ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

◆ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

వెల్దుర్తి(తూప్రాన్): తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ రెండో ఏఎన్ఎంలు సోమవారం తహసీల్దార్ నాగవర్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. 15 ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తూ చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామన్నారు. కరోనా సమయంలో ప్రాణాలు సైతం లెక్క చేయకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించిన తమను ప్రభుత్వం గుర్తించి, రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో సునీత, శోభ, అనిత, సోని, భూలక్ష్మి, యశోద, జయంతి పాల్గొన్నారు.

◆ సన్మానం

రామాయంపేట(మెదక్): నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నార్సింగి మండల తహసీల్దార్ కరీంను సోమవారం బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. పార్టీ మండల నాయకుడు అంచనూరి రాజేశ్, సహకార సంఘం డైరెక్టర్ బిక్యానాయక్, పెద్ద తండా బీఆర్ఎస్ అధ్యక్షుడు బాషానాయక్, తదితరులు సన్మానించారు.

◆ విరాళం అందజేత

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరీల గ్రామంలో యాదవ కులస్తులు మల్లన్న గుడి పునఃర్నిర్మాణం చేపడుతున్నారు. నిర్మాణ పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. ఆలయ నిర్మాణానికి తనవంతుగా శివ్వంపేట ఎంపీపీ, ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ సోమవారం రూ.50 వేలు విరాళం అందజేశారు. దీంతో ఆలయ నిర్వాహకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నింగి కిష్టయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ కార్యకర్త అంత్యక్రియల్లో ఎమ్మెల్యే

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేట గ్రామంలో బీజేపీ కార్యకర్త భాస్కర్‌రెడ్డి అంత్యక్రియల్లో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు పాల్గొని కార్యకర్త కుటుంబీకులను ఓదార్చారు. కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. అలాగే పులిమామిడి గ్రామంలో ఇటీవల మృతి చెందిన శ్యామల, రామస్వామి, గౌరైరాజు, కొమ్ము యశ్వంత్ కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు భూపాల్, రఘువీర్‌రావు, సంతోష్‌రెడ్డి, నర్సింలు, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

◆ ముఖ్యమంత్రి హామీకే దిక్కులేదా..?

మెదక్: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీకే దిక్కులేకుండా పోయిందని, 2014 ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్‌డీఎస్ఎల్ ఫ్యాక్టరి తెరిపిస్తామని చెప్పి నేటికి ఎందుకు తెరిపించలేదని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఎందుకు చేయటం లేదన్నారు.

◆ ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ

కొల్చారం(నర్సాపూర్): ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుదని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అంసాన్‌పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మగుడి వద్ద సొంత నిధులతో బోరుబావి తవ్వకం పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్, కౌడిపల్లి డివిజన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, స్టేట్ ఓబీసీ సెల్ రాష్ట్ర నాయకుడు మురళీధర్, పార్టీ ఉపాధ్యక్షుడు గోవర్దన్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఇతర నాయకులు ఉన్నారు.